సోలార్ కంచె.. నిలువరించె..!

అడవి జంతువుల దాడి నుంచి పంటలు రక్షించుకునేందుకు రైతులు ఒకప్పుడు ఇబ్బందులు పడేవారు. నిద్రాహారాలు మాని రాత్రిపూట పొలాల వద్ద కాపలా కాసినా పెద్దగా ప్రయోజనం లేకపోయేది. కాని ఇప్పుడా పరిస్థితి దూరమైంది. సోలార్ కంచెతో పంటల రక్షణకు ఢోకా లేకుండా పోయింది. అటు అటవీ జంతువులకు ఎలాంటి హాని లేకపోవడంతో వీటి వినియోగం పెరుగుతోంది.


దౌల్తాబాద్‌లో రైతు ఏర్పాటు చేసిన సోలార్ బాక్స్

- తక్కువ ధరకే పరికరాలు లభ్యం
- ఆసక్తి చూపుతున్న రైతులు

దౌల్తాబాద్: రైతులు సాగు చేస్తున్న పంటలను అడవి పందులు, పశువుల బెడద నుంచి రక్షించుకోవడానికి సోలార్ కంచెను వినియోగిస్తున్నారు. గతంలో పంటలను కాపాడుకోవడానికి అన్నదాతలు పగలు, రాత్రి తేడా లేకుండా నిద్రాహారాలు మాని నిత్యం పంట పొలాల్లోనే కాలం గడిపేవారు. అయితే సోలార్ కంచెతో అడవి జంతువులతో పాటు మనుషులకు కూడా ఎలాంటి ప్రమాదం లేకపోవడంతో సోలార్ కంచె వినియోగంపై రైతులు ఆసక్తి చూపుతున్నారు.

మండలంలో....

మండలంలోని నందారం, నీటూరు, దౌల్తాబాద్, ,చల్లాపూర్, ఈర్లపల్లి, అంతారం, తదితర గ్రామాల్లో రైతులు ఈ సోలార్ కంచెను ఏర్పాటు చేసుకున్నారు. రైతులు సాగు చేస్తున్న వరి, పత్తి, కంది, శనగ, ఇతర పంటలు నిత్యం అడవిపందులు, కోతుల దాడుల్లో దెబ్బతింటున్నాయి. దీంతో పంటలు కాపాడుకోవడానికి అన్నదాతలు సోలార్ కంచె ఏర్పాటు చేస్తున్నారు.

తక్కువ ఖర్చు...

2నుంచి 20 ఎకరాలు సాగు చేస్తున్న రైతులు సోలార్ కంచెను ఏర్పాటు చేసుకుంటున్నారు. మార్కెట్‌లో రూ.8వేల నుంచి రూ.20వేల వరకు పెట్టుబడితో రైతులకు కావాల్సిన పరికరాలు అందుబాటులో ఉంటున్నాయి. కర్రలు, జీఏవైర్, ఇన్సులేటర్, సోలార్ ప్యానెల్, బ్యాటరీలు వినియోగించి చేను చుట్టూ కంచెను ఏర్పాటు చేస్తున్నారు. కంచెకు నిరంతరం విద్యుత్ సరఫరా అయ్యే వెసులుబాటు ఉండడంతో రైతులు పగలు, రాత్రి పంటలకు కంచెను ఏర్పాటు చేస్తున్నారు.

బ్యాటరీ నుంచి వచ్చే డీసీ విద్యుత్‌తో జంతువులు కంచెను తగిలితే స్వల్పంగా షాక్ తగిలి బెదిరిపోతున్నాయి. ఎలాంటి ప్రమాదం లేకపోవడంతో రైతులు సోలార్ కంచె వినియోగం పెరుగుతోంది.

క్లుప్తంగా

3న పార్వతీ పరమేశ్వరుల కల్యాణం


శివభక్త మార్కండేయ దేవాలయం

తాండూరు టౌన్ : తాండూరు పట్టణం కొడంగల్ రోడ్డు మార్గంలోని శివ భక్త మార్కండేయ స్వామి ఆలయంలో మార్చి 3న పార్వతీ పరమేశ్వరుల కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వరుడు పరమేశ్వరుని తరఫున చెరుకుపల్లి ప్రభావతి, బాల్‌రాజ్ దంపతులు, వధువు పార్వతీదేవి తరఫున మాధవి, రాజు యాదవ్ దంపతులు కల్యాణం జరిపించనున్నారు. భక్తులు భారీగా తరలివచ్చి కల్యాణం తిలకించాలని కోరారు.

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర బ్రాంచ్ ప్రారంభం


బ్యాంక్‌ను ప్రారంభిస్తున్న అధికారులు

తాండూరు టౌన్ : పట్టణంలోని శివాజీచౌక్ సమీపంలో నూతనంగా ఏర్పాటైన బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర తాండూరు బ్రాంచ్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్న బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర వారు కొత్తగా తమ సేవలను తాండూరు ప్రాంత ప్రజలకు అందించడం హర్షణీయమన్నారు. అనంతరం బ్రాంచ్ మేనేజర్ ప్రకాష్ మాట్లాడుతూ.. తాండూరు బ్రాంచ్ ద్వారా ప్రజలకు హోం లోన్లు, బంగారం తాకట్టుపై తక్కువ వడ్డీకి రుణాలు అందిస్తున్నామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

చురుగ్గా ఆలయ నిర్మాణం

కొడంగల్: పట్టణ శివారులోని బండల ఎల్లమ్మ ఆలయం సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణం జోరుగా సాగుతోంది. ఆలయ నిర్మాణానికి దాతలు సహకరించాలని కమిటీ సభ్యులు బుధవారం కోరారు. తమిళనాడు రాష్ట్రం నుంచి శిలలు తెప్పించినట్లు తెలిపారు. ఇందుకు పెద్ద మొత్తంలో డబ్బులు అవసరం ఉందన్నారు. సరైన సమయంలో విరాళాలు ఇచ్చి సహకరిస్తే ఆలయ నిర్మాణం మరింత వేగంగా ముందుకు సాగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు. వచ్చే కార్తీకమాసం వరకు పనులు పూర్తి చేసి ఆలయాన్ని అందుబాటులోకి తీసుకొని రావడానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన

కొడంగల్ రూరల్: పట్టణంలోని కార్గిల్ కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీధీర వీరాంజనేయస్వామివారి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. పట్టణ పురోహితులు కట్టు స్వామి బృందం ఆధ్వర్యంలో పలు పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో చేశారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన అవుసుల పరమేశ్ ఆధ్వర్యంలో అన్న(ప్రసాద) కార్యక్రమం ఏర్పాటు చేశారు.

తాండూరులో 75 మంది గైర్హాజరు

- తొలిరోజు ఇంటర్ పరీక్ష ప్రశాంతం
- పరీక్షా కేంద్రాలను పరిశీలించిన డీఎస్పీ బాలకృష్ణారెడ్డి


తాండూరు టౌన్: పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ బాలకృష్ణారెడ్డి


పెద్దేముల్: విద్యార్థులను చెక్ చేస్తున్న పోలీసులు

తాండూరు టౌన్ : తొలి రోజు ఇంటర్ పరీక్ష ప్రశాంతంగా ప్రారంభమైంది. బుధవారం పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు గంట ముందుగానే చేరుకున్నారు. తాండూరు పట్టణంలోని ఎనిమిది పరీక్షా కేంద్రాల్లో 2,429 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా, 75 మంది గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, ఫర్నీచర్, మెడికల్ తదితర వసతులను విద్యార్థులకు కల్పించారు. కేంద్రాల వద్ద ఎస్సైతో పాటు ఇద్దరు కానిస్టేబుళ్లు పహారా కాశారు. ప్రత్యేకంగా ఒక స్పెషల్ ఆఫీసర్‌ను సైతం విద్యాశాఖ ఏర్పాటు చేసింది. డీఎస్పీ బాలకృష్ణారెడ్డి పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

10మంది విద్యార్థుల గైర్హాజరు

మోమిన్‌పేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన వార్షిక పరీక్షకు 10 మంది జూనియర్ కళాశాల విద్యార్థులు గైర్హాజరయ్యారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, కస్తూర్బా గాంధీ పాఠశాల, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలకు చెందిన మొత్తం 155మంది విద్యార్థులు ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు రాయాల్సి ఉంది. కాని మొదటి రోజు 10మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ప్రిన్సిపాల్ చెన్నయ్య తెలిపారు.

పెద్దేముల్ 8 మంది గైర్హాజరు

పెద్దేముల్: మొదటి రోజు బుధవారం ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. సమయానికి ముందే విద్యార్థులు కేంద్రానికి చేరుకున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద అన్ని ఏర్పాటు చేశారు. పెద్దేముల్ ఎస్‌ఐ గిరి సిబ్బందితో గట్టి బందోబస్తు ఏర్పాట్లు చేశారు. తహసీల్దార్ కిషన్, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ రాజిరెడ్డిలు పరీక్ష పూర్తి అయ్యే వరకు కేంద్రం వద్దనే పర్యవేక్షణ చేశారు. పెద్దేముల్ మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 218 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 210 మంది హాజరయ్యారని, 8 మంది గైర్హాజరయినట్లు చీఫ్ సూపరింటెండెంట్ రమేశ్ తెలిపారు.

కొడంగల్‌లో 25 మంది గైర్హాజరు

కొడంగల్ రూరల్ : ఇంటర్ మొదటి సంవత్సరం తెలుగు, ఉర్దూ, హిందీ, సంస్కృతం సబ్జెక్టులకు సంబంధించి పరీక్షలు బుధవారం నిర్వహించారు. మొత్తం 651మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 626మంది మాత్రమే హాజరయ్యారని, 25మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని నిర్వహణ అధికారి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. పరీక్షా కేంద్రాన్ని తహసీల్దార్ విజయకుమార్ పరిశీలించారు.

మార్చి 4న చలో వికారాబాద్

కొడంగల్ : మార్చి 4న చలో వికారాబాద్ కార్యక్రమం చేపట్టినట్లు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య తెలిపారు. బుధవారం పట్టణంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. మార్చి 4న జిల్లా ఎస్పీ కార్యాలయాన్ని ముట్టడిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు వెంకటయ్య, చంద్రయ్య, రమేష్‌బాబు, సూర్యానాయక్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

దోమ : దేవాలయాల అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలను అందిస్తానని పాలేపల్లి గ్రామానికి చెందిన గురుస్వామి దస్తయ్య అన్నారు. బుధవారం మండలంలోని పాలేపల్లి గ్రామస్తులు హనుమాన్ దేవాలయానికి మరమ్మతులు చేపట్టారు. ఈ మేరకు గురుస్వామి దస్తయ్య రూ. 5 వేల విరాళం అందజేశారు. కార్యక్రమంలో శివస్వాములు నర్సింహులు, తిరుపతి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయం

సర్పంచుల సంఘం మాజీ మండల అధ్యక్షుడు రాజిరెడ్డి


విద్యార్థులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న రాజిరెడ్డి

దోమ: ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న పేద విద్యార్థులకు స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయమని మాజీ సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు రాజిరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో కొండ మాధవరెడ్డి ఫౌండేషన్ పేద విద్యార్థులకు అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాములుతో కలసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద విద్యార్థులు నిరక్ష్యరాస్యులు కావడానికి ప్రధాన కారణం కుటుంబ పరిస్థితులేనని అన్నారు. అలాంటి విద్యార్థులకు స్వచ్ఛంద సంస్థలు ఆర్థికంగా చేయూతనివ్వడం సంతోషకరమన్నారు. అంతకుముందు ఐనాపూర్ పాఠశాలలో గ్రామ మాజీ ఉపసర్పంచ్ బుగ్గయ్యతో కలసి విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించారు. దిర్సంపల్లి పాఠశాలలో బీజేపీ మండల అధ్యక్షుడు

ఆకట్టుకున్న సైన్స్ దినోత్సవం


అనంతగిరి: విద్యార్థుల ప్రదర్శనలను తిలకిస్తున్న డీఎస్పీ అంజయ్య తదితరులు


బంట్వారం: బార్వాద్ జెడ్పీ హెచ్‌ఎస్‌లో..

దోమ: సైన్స్ దినోత్సవ ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. బుధవారం దోమ మండల పరిధిలోని కిష్టాపూర్, బొంపల్లి, దోమ, దాదాపూర్, దిర్సంపల్లి, మోత్కుర్‌తో పాటు తదితర పాఠశాలలో విద్యార్థులు సైన్స్ దినోత్సవ వేడుకలను ఘనంగా జరిపారు. ఈ వేడుకల్లో భాగంగా విద్యార్థులు స్వీయ ఆలోచన ప్రతిభతో విజ్ఞాన పరమైన సైన్స్, గణితావిష్కరణలను ప్రదర్శించారు. తరగతుల వారీగా పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల పర్యావేక్షణలో చిన్నారులు వివిధ రకాల విజ్ఞాన ప్రాజెక్టులను తయారు చేశారు. ఈ ప్రాజెక్టులను ఉపాధ్యాయులు వీక్షించి విద్యార్థులను అభినందించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు నీల్‌సింగ్, వెంకటయ్య, మహేంద్రాబహదూర్, వాణి, లకోష్మ్‌రెడ్డి అమృత, భీమ్యానాయక్, గోపాల్, విజయలక్ష్మి, శ్రీలత, శ్రీనివాస్, శాంతి, బాలమణి, సువర్ణ, సీఆర్‌పీ రెడ్యానాయక్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్‌లో..

కొడంగల్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సీవీ రామన్ చేసిన ప్రయోగాల గురించి ఉపాధ్యాయులు వివరించారు. విద్యార్థులు వారి మేథస్సుకు పదును పెట్టి పలు పరిశోధనాత్మక ప్రయోగాలు చేశారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎంఈఓ రాంరెడ్డి అభినందించారు.

ఎగ్జిబిట్లతో అలరించిన విద్యార్థులు

తాండూరు టౌన్ : జాతీయ సైన్స్ డేను పురస్కరించుకుని పట్టణంలోని పలు విద్యా సంస్థల్లో బుధవారం ఎగ్జిబిట్లను ఘనంగా నిర్వహించారు. పలు పాఠశాలల్లో విద్యార్థులు స్వయంగా పలు రకాల ఎగ్జిబిట్లను తయారు చేశారు. ఈ సందర్భంగా సర్ సీవీ రామన్ ఆవిష్కరణలను కొనియాడారు. భవిష్యత్‌లో విద్యార్థులు శాస్త్రీయత, ఆధునికత, టెక్నాలజీని ఏకాగ్రతతో అలవర్చుకోవాలన్నారు. చిన్ననాటి నుంచి పలు పరిశోధనల వైపు విద్యార్థులు మొగ్గు చూపాలని పలువురు ఉపాధ్యాయులు తెలిపారు.

భావి పౌరులుగా తీర్చిదిద్దాలి: డీఎస్పీ

అనంతగిరి: విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదేనని వికారాబాద్ డీఎస్పీ అంజయ్య అన్నారు. బుధవారం వికారాబాద్‌లోని శ్రీ చైతన్య స్కూల్‌లో సైన్స్ డే సందర్భంగా చిన్నారులు పలు ఎగ్జిబిట్ల ప్రదర్శించారు. డీఎస్పీ మాట్లాడుతూ విద్యార్థుల్లో ఇప్పటి నుంచే సైన్స్‌పై మక్కువ పెంచాలన్నారు. శాస్త్రవేత్తలుగా ఎదిగి మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రామచంద్రుడు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక రంగంపై ఆసక్తి పెంచుకోవాలి

పరిగి: సాంకేతిక రంగంపై ఆసక్తి పెంచుకోవాలని మున్సిపల్ చైర్మన్ ముకుందఅశోక్‌కుమార్ సూచించారు. బుధవారం నేషనల్ సైన్స్‌డే సందర్భంగా పట్టణంలోని పలు ఉన్నత పాఠశాలల్లో నేషనల్ సైన్స్ డేను ఘనంగా జరుపుకొన్నారు. విద్యార్థులు తయారు చేసిన ఎక్స్‌పరిమెంట్‌లను ఉపాధ్యాయులు పరిశీలించి అభినందించారు. కార్యక్రమంలో నాయకులు రవికుమార్, మునీర్,కృష్ణ,మౌలానా,తాహేర్, ఆయ పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


కొడంగల్ : ప్రయోగాలు వీక్షిస్తున్న ఎంఈఓ రాంరెడ్డి


పరిగి: కిష్టాపూర్ పాఠశాలలో సైన్స్ పరికరాలను పరిశీలిస్తున్న ప్రధానోపాధ్యాయులు లాల్యానాయక్


బొంపల్లి పాఠశాలలో విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ పరికరాలు

ఔట్ డేటెడ్ నాయకులు మాకొద్దు

కాంగ్రెస్ యాలాల మండల నాయకులు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

యాలాల: మండలంలోని ఔట్ డేటెడ్ నాయకులు మా పార్టీలోకి వద్దని మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు మండిపడ్డారు. మంగళవారం చెవేళ్ల సభలో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో యాలాల మాజీ ఎంపీపీ కరణం పురుషోత్తం రావు, సొసైటీ మాజీ చైర్మన్ సిద్రాల శ్రీనివాస్‌లు కాంగ్రెస్‌లో చేరారు. వారి రాకను వ్యతిరేకిస్తూ బుధవారం కాంగ్రెస్ సీనియర్లు, కార్యకర్తలు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి రోహిత్‌రెడ్డి వైపు ఉండి, మనోహర్‌రెడ్డి ఓ టమి కోసం పనిచేసినా నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారు పార్టీలోకి వస్తున్నారనే కనీస సమాచారం ఎమ్మెల్యే మనోహర్ రెడ్డికి కూడా ఇవ్వకపోవడం దారుణమన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక బీఆర్‌ఎస్ నాయకులతో ఎన్నో ఇబ్బందులు పడ్డామని చెప్పారు. గత పదేళ్లుగా అధికారానికి దూరంగా ఉన్నప్పటికీ కాంగ్రెస్‌ను వీడకుండా కార్యకర్తలను కాపాడుకున్నామని వెల్లడించారు. కార్యకర్తల అభిప్రాయం తీసుకోకుండా పార్టీలోకి చేర్చుకోవడం సరికాదన్నారు. ఈ విషయంలో అధిష్టానం పునరాలోచించాలన్నారు. ప్రభుత్వ పథకాల్లో, ఇతరత్రా కార్యక్రమాల్లో కాంగ్రెస్ కార్యకర్తలకే పెద్దపీట వేస్తామని సొసైటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ బీ బ్లాక్ అధ్యక్షుడు అనిల్‌కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి, మాజీ అధ్యక్షుడు గురురాజ్ జోషి, కోఆప్షన్ సభ్యుడు అక్బర్‌బాబా, సీనియర్ నాయకులు హన్మంతు, మహిపాల్, మల్లయ్య, నర్సింహులు, ఖాసీం, నాగప్ప, మైనోద్దీన్, అహ్మద్ ఉన్నారు.

ఎస్పీ కోటిరెడ్డిని కలిసిన ఎస్‌ఐ


కోటిరెడ్డికి మొక్కను అందజేస్తున్న ఆనంద్‌కుమార్

దోమ: దోమ ఎస్‌ఐ ఆనంద్‌కుమార్ జిల్లా ఎస్పీ కోటిరెడ్డిని బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల బంట్వారం మండలంలో విధులు నిర్వహించిన ఆయన బదిలీపై దోమ పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. ఈ మేరకు ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ కోటిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. శాంతి భద్రతల పరిరక్షణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు. సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని చెప్పారు.

ప్రతీ గ్రామానికి కొండా సేవలు

బీజేపీ రాష్ట్ర నాయకుడు పరమేశ్వర్ రెడ్డి


ఆర్థిక సహాయం అందజేస్తున్న నాయకులు

కుల్కచర్ల: చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని నిరుపేద ప్రజలందరికీ నిస్వార్థంగా సేవ చేస్తున్న వ్యక్తి మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని బీజేపీ నేత మిట్టా పరమేశ్వర్ రెడ్డి అన్నారు. బుధవారం చౌడాపూర్ మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు బంధయ్య ఆధ్వర్యంలో 40మంది పేద విద్యార్థులకు రూ.2500 అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి చేస్తున్న సేవా కార్యక్రమాల ఫలితాలు ప్రతి గ్రామంలో ఉండటం ఎంతో గొప్ప విషయమన్నారు. అధికారంలో ఉన్నా లేకున్నా తన సొంత డబ్బులతో నిరుపేదల అభ్యున్నతికి కృషి చేస్తున్న ఏకైక వ్యక్తి విశ్వేశ్వర్ రెడ్డి అన్ని చెప్పారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, ఎస్పీ మోర్చా జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, బీజేవైఎం మండల అధ్యక్షుడు శరత్‌కుమార్, కుల్కచర్ల మండల పార్టీ అధ్యక్షుడు మైపాల్, కుల్కచర్ల మాజీ సర్పంచ్ సౌమ్యారెడ్డి, కొండా ఫౌండేషన్ పరిగి నియోజకవర్గ ఇన్‌చార్జి రాంచంద్రయ్య, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు వెంకటేష్, నాయకులు జనార్దన్, మైపాల్, లింగం పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ పత్రాలు అందజేత


బాధిత కుటుంబ సభ్యులకు ఎల్‌ఓపత్రాలు ఇస్తున్న తిరుపతిరెడ్డి

కొడంగల్: నియోజకవర్గంలోని దౌల్తాబాద్, బొంరాస్‌పేట, మద్దూరు, కోస్గి మండలాలకు చెందిన లబ్ధిదారులకు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి బుధవారం బాధిత కుటుంబాలకు ఎల్‌ఓసీ పత్రాలను అందజేశారు. మద్దూరు మండలం అప్పిరెడ్డిపల్లికి చెందిన నర్సింలుకు రూ.85వేలు, దౌల్తాబాద్ మండలం బాలంపేటకు చెందిన బేబీ ఆఫ్ మనోజ్ఞ కుటుంబ సభ్యులకు రూ.2.70లక్షలు, కోస్గికు చెందిన సదానందంకు రూ.1.90లక్షలు, దౌల్తాబాద్ మండలం చంద్రకల్‌కు చెందిన నాగమ్మకు రూ1.50లక్షలు, దౌల్తాబాద్‌కు చెందిన గోపాల్‌కు 1.90లక్షలు, బొంరాస్‌పేట గ్రామానికి చెందిన జహీరాబేగంకు రూ.2.10లక్షలు మంజూరు చేయించారు. ఈ మేరకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు బాధిత కుటుంబాలకు అందజేశారు.

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న గౌసన్

కొడంగల్ రూరల్: చలివేంద్రం బాటసారులకు ఎంతో ఉపయోగపడుతుందని మాజీ ఉప సర్పంచు ఎస్‌ఎం.గౌసన్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఫారెస్టు ఆఫీసు పక్కన షేక్ రోమన్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎం.గౌసన్ చలివేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బాటసారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో షేక్ రోమన్, మహ్మద్ ఖాసీం, మహ్మద్ సరాజ్ అల్దీన్‌మక్సూద్, బాల్‌రాజ్, అర్జున్, సలీం మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

శివభక్తుల శ్రీశైలం పాదయాత్ర


కొడంగల్ రూరల్: హస్నాబాద్ నుంచి పుణ్యక్షేత్రానికి తరలివెళ్తున్న శివస్వాములు

కుల్కచర్ల: శివరాత్రిని పురస్కరించుకుని శివమాల ధారణ చేసిన భక్తులు ఇరుముడులు ధరించి పాదయాత్రగా శ్రీశైలం బయలుదేరారు. బుధవారం మండలంలోని బండవెల్కిచర్లకు చెందిన శివస్వాములు ఎంపీటీసీ జ్యోతిశ్రీనివాస్ ఆధ్వర్యంలో పాంబండ రామలింగేశ్వర దేవస్థానం నుంచి శ్రీశైలం వరకు పాదయాత్రగా బయలుదేరారు. ఈ సందర్భంగా జ్యోతిశ్రీనివాస్ మాట్లాడుతూ.. శివమాల ధారణ ఎంతో పవిత్రమైందన్నారు. వ్యక్తి తనలోని చెడు అలవాట్లకు దూరంగా ఉండేందుకు, మానసిక ప్రశాంతతకు మాలధారణ ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

పాదయాత్రగా పుణ్యక్షేత్రానికి..

కొడంగల్ రూరల్: మహాశివరాత్రిని పురస్కరించుకొని శివస్వాములు బుధవారం శ్రీశైలం పుణ్యక్షేత్రానికి తరలివెళ్లారు. మండల పరిధిలోని హస్నాబాద్‌లో భీమరాయుని దేవాలయంలో, వీరభద్రేశ్వర స్వామివారి దేవాలయంలో, కస్తూర్‌పల్లి గ్రామంలో హనుమాన్ దేవాలయంలో గురుస్వాముల ఆధ్వర్యంలో శివస్వాములు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గురుస్వాములు ఇరుముడి కట్టి ఆశీర్వాదం అందించగా పాదయాత్రగా పుణ్యక్షేత్రానికి తరలివెళ్లారు.